# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశంలో నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు ఓం బిర్లా ఎన్నికయ్యారు.**

**2. చిత్తూరు జిల్లాలోని తన సొంత నియోజకవర్గం కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన రెండవ రోజు కొనసాగుతోంది.**

**3. రైతులకు రాయితీ నగదును అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులని ఆదేశించారు.**

**4. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు సాయంత్రం వెలువడతాయి.**

**5. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా పలు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.**

==========================

దేశంలో నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు ఓం బిర్లా ఎన్నికయ్యారు. ఈరోజు లోక్‌సభ సభాపతికి జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఆయన విజయం సాధించారు. ఈరోజు ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. సభాపతిగా ఓం బిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీర్మానం ప్రవేశపెట్టగా, అటు ఇండియా కూటమి తరపున కె.సురేశ్ పేరును శివసేన పార్లమెంట్ సభ్యులు అరవింద్ సావంత్ తీర్మానించారు. అనంతరం మూజువాణీ విధానంలో ఓటింగ్ చేపట్టగా.. ఎన్నికలో ఓం బిర్లా విజేతగా నిలిచినట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వెంటరాగా.. ఓం బిర్లా సభాపతిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, అమృత కాలంలో దేశాభివృద్ధికి సభాపతిగా ముఖ్యభూమిక పోషించనున్నారని పేర్కొంటూ....

**.....వాయిస్... 26 సెకన్లు....**

అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా పలువురు లోక్‌సభ సభ్యులు ఓం బిర్లాకు అభినందనలు తెలియజేశారు.

-------------------------

కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లాలోని తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండవ రోజు ముఖ్యమంత్రి పర్యటన కొనసాగుతోంది. ఈ ఉదయం కుప్పంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నియోజకవర్గ ప్రజల నుంచి ముఖ్యమంత్రి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. అనంతరం కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ ప్రభుత్వ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ పనులతో పాటు కుప్పం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఉద్యాన రైతులకు రాయితీ మొత్తాన్ని సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న మంగళగిరిలోని వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో భూసార పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎరువులు తీసుకునే రైతులు ముందుగా డబ్బు చెల్లించవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంచడంతో పాటు అంతర పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలని సూచించారు.

---------------------------

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ రోజు విడుదలవుతాయి. ఈ రోజు సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయంలో విడుదల చేయనున్నామని అధికారులు తెలిపారు. ఫలితాలను ఇంటర్మీడియట్ అధికారిక వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చని పేర్కొన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షలకు సుమారు 3.40 లక్షల విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

నీట్-యూజీ పరీక్షా పత్రం లీక్ ఆరోపణలపై విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పేపర్ లీక్ విషయంలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో పరీక్ష సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు... విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి మానసిక స్థితి కలిగి ఉండాలన్న అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

మాదక ద్రవ్యాల నివారణ ఒక సామాజిక బాధ్యతగా భావించి, ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలనీ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో బీచ్ రోడ్ నుంచి కాళీమాత ఆలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత తమ భవిష్యత్తును పూర్తిగా కోల్పోతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మాదక ద్రవ్యాల నివారణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్–సిబిసి అధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి విశాఖ నగరంలో నిర్వహించిన చిత్ర ప్రదర్శన నిన్నటితో ముగిసింది. ఈ చిత్ర ప్రదర్శనను విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ ప్రారంభించగా ఐదు రోజుల పాటు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో యోగాసనాలు, యోగా ప్రక్రియలు, వివిధ ప్రభుత్వ పథకాలపై దృశ్యమాధ్యమ విధానాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ చిత్ర ప్రదర్శనలో భాగంగా వివిధ కళాశాలలు, పాఠశాలల్లో యోగాపై పోటీలు నిర్వహించగా గెలుపొందిన విజేతలకు సిబిసి ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌదరీ, సిబిసి విజయవాడ డైరెక్టర్ పి.రత్నాకర్ బహుమతులు అందజేశారు.

---------------------------

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని అంబేద్కర్ సెంటర్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. ఈరోజు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకొని స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ ప్రారంభించారు.

యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని తిరుపతి జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకొని తిరుపతిలోని ప్రకాశం రోడ్డులో అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజులతో కలిసి ప్రారంభించారు.

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతకు ప్రత్యేక కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరులో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై నిర్వహించిన అవగాహన ర్యాలీనీ జిల్లా ఎస్పీ పి. జగదీష్ జెండా ఊపి ప్రారంభించారు.

1987 లో ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు ఈరోజు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నామని గుంటూరు జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి లీలావతి తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల అవగాహనా ర్యాలీని జిల్లా ఎస్.పి తుషార్ దూడిలతో కలిసి ప్రారంభించారు.

మాదకద్రవ్యాల వినియోగం నుంచి యువతను చైతన్య పరిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కృష్ణాజిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి కెవి రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మచిలీపట్నంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

---------------------------

జనసేన శాసన సభ్యులందరూ తమతమ నియోజకవర్గాల్లో 'జనవాణి' కార్యక్రమం చేపట్టాలని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ శాసన సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడతూ... ప్రజలతో గౌరవంగా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమంగా సాగాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

---------------------------

బీసీ భవనాలు, బీసీ సంక్షేమ వసతి గృహాల నిర్మాణ పనుల్లో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ, చేనేత, జౌళిశాఖలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు క్యాలెండర్ రూపొందించాలన్నారు. చేనేత, హస్తకళలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహకారం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు.

---------------------------

జూలై 1వ తేది నుంచి అమలులోకి రానున్న నూతన నేర చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అరీఫ్ ఆఫీజ్ తెలిపారు. నూతన చట్టాలపై దృశ్య మాధ్యమం ద్వారా అధికారులకు నిన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాలకు సంబంధించిన శిక్షలపై కొత్త చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ప్రతి అంశాన్నీ పరిశీలించాలన్నారు. నూతన చట్ట పరిధిలో కేసులు దర్యాప్తు చేసి ముద్దాయిలకు శిక్షలు పడేలా కృషి చేయాలని కోరారు.

======================